

రైతులు, వ్యాపారులతో చర్చలు జరుపుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్

కోహిర్ అల్లాన్ని కొనుగోలు చేయాలి

● వ్యవసాయ మార్కెట్ కమిటీ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్

ఓల్డ్ మలకోపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ కోహిర్ నుంచి రైతులు తీసుకవచ్చే అల్లం పంటను కొనుగోలు చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అడిషినల్ డైరెక్టర్ రవికుమార్ అల్లం వ్యాపారులను ఆదేశించారు. మంగళవారం మలకపేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కోహిర్ రైతులు, అల్లం వ్యాపారులతో వ్యవసాయ మార్కెట్ అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అల్లంను నెలరోజుల పాటు కొనుగోలు నిలుపుదల చేసి మన రాష్ట్రం కోహిర్ నుంచి వచ్చే అల్లం కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. సమావేశంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ మల్లేషం, డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్-1 అధికారి చిలుక నర్సింహరెడ్డి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

పసుమాముల-పెద్ద అంబర్‌పేట్‌కు అండర్ పాస్ నిర్మించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ వద్ద విజయవాడ జాతీయ రహదారిపై పసుమాముల-పెద్దఅంబర్‌పేట్‌కు అండర్ పాస్‌ను వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం జాతీయ రహదారుల ఏఈ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యను ఏఈకి వివరించారు. పసుమాముల నుంచి పెద్దఅంబర్‌పేట్‌కు వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటేందుకు చుట్టూ తిరుగాల్సి వస్తోందన్నారు. అదే విధంగా జాతీయ రహదారి పక్కనే గ్రామానికి సంబంధించిన శ్మాశాన వాటిక కూడా ఉందన్నారు. ఎవరైనా చనిపోయిన అంత్యక్రియలు చేసేందుకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. వీటన్నింటికి పసుమాముల రోడ్డు వద్ద అండర్ పాస్ నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, గంట శ్రీనివాస్‌రెడ్డి, సత్తార్, లక్ష్మారెడ్డిగంట, రాజశేఖర్‌రెడ్డి, మధు, రామలింగం, మజ్జిగ లక్ష్మారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీగా సుక్రు నాయక్

హయత్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రమావత్ సుక్రు నాయక్ నియమితులయ్యారు. రాజేందర్‌నగర్‌లో జరిగిన జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. బీ అండ్ సీడబ్ల్యూసీ సహాయ కార్యదర్శిగా చెంది వెంకట్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మందుల కృష్ణ ఎన్నికయ్యారు.



ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు కృషి చేయాలనీ బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ దోమల మూలంగా ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నారని తెలిపారు. కావున తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, నాయకులు కల్లు విష్ణువర్దన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



స్వాతి

చాదర్‌ఘాట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి తిరిగిరాని సంఘటన మలకపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం... మూసారాంబాగ్ సాయినగర్ కాలనీ నివాసి స్వాతి ఈ నెల 14వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మూడు నెలల క్రితం స్వాతి స్నేహితుడైన అనుతో కలిసి వెళ్లి మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చిందని స్వాతి తల్లి తెలిపింది. ఇప్పుడు మళ్లీ ఇంటి నుంచి వెళ్లిందని, స్నేహితుడైన అనుతోనే వెళ్లి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ సోమవారం రాత్రి తల్లి భూదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫంక్షన్‌కు వచ్చిన వ్యక్తి..



నింగప్ప

చాదర్‌ఘాట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌కు వచ్చిన తన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదంటూ ఓ తల్లి మలకపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంగారెడ్డి జిల్లా రాయ్ కోడే గ్రామం, ఎస్‌సీ కాలనీ నివాసి నదిమి దొడ్డి మణెమ్మ తన కుమారుడు నదిమి దొడ్డి నింగప్ప (41)తో కలిసి ఈనెల 16వ తేదీన మూసారాంబాగ్ శ్రీపురం కాలనీ బస్టాపు వద్ద ఉన్న రజక సంఘం కమ్యూనిటీహాల్‌లో బంధువుల ఫంక్షన్‌కు వచ్చారు. తిరిగి వృద్ధురాలు మణెమ్మ ఇంటికి వెళ్లగా కుమారుడు నింగప్ప రాకపోవడంతో ఎన్టీఆర్ నగర్‌లోని తనమూడో కుమారుడు అనిల్ ఇంటికి వెళ్లి ఉంటాడని భావించింది. అనిల్‌ను ఫోన్ చేయగా నింగప్ప రాలేదని చెప్పడంతో మలకపేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తులతో సంచరిస్తున్న ఇద్దరు యువకులపై కేసు

సైదాబాద్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కత్తులతో బైక్‌పై సంచరిస్తున్న ఇద్దరు యువకులపై మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి రెయిన్‌బజార్ వాటర్ ట్యాంక్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై అనుమానాస్పదంగా వచ్చిన అబ్దుల్ అహ్మద్, సయ్యద్ యూసుఫ్‌లను పోలీసులు పట్టుకునేందుకు యత్నించారు. దీంతో అబ్దుల్ అహ్మద్ పారిపోగా సయ్యద్ యూసుఫ్‌ను పట్టుకుని తనిఖీ చేయగా కత్తి దొరికింది. దీంతో మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు ఆకతాయిల అరెస్టు

సంతోష్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు మితిమీరిపోతున్న పోకిరీల ఆగడాలు, సోషల్‌మీడియాలో లైక్‌ల కోసం బుర్ఖా ధరించి ద్విచక్రవాహనంపై విన్యాసాలు చేసిన ఇద్దరు ఆకతాయిలను ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రైన్‌బజార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అహ్మద్(21), మహ్మద్ అబ్దుల్ వాసిఫ్(21)లు ప్రజలను ఆట పట్టించేందుకు ఈ నెల 15వ తేదీన బుర్ఖా ధరించిన మహ్మద్ అహ్మద్ తన ద్విచక్రవాహనంపై తన స్నేహితుడిని వెనుక కూర్చో పెట్టుకొని విన్యాసాలు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించాడు. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. సమాచారం తెలుసుకున్న ఐఎస్‌సదన్ పోలీసులు ఇద్దరు ఆకతాయిలను అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.





ఎల్బీనగర్‌లో సర్వీసు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో వాహనదారుల ఇక్కట్లు



మార్గదర్శికాలనీలో భారీ వృక్షం నేలకొరగడంతో దెబ్బతిన్న ఆటో

భారీ వర్షం

● కాలనీల్లో రహదారులను ముంచెత్తిన వరదనీరు
● కూలిన భారీ వృక్షాలు ● రాకపోకలకు ఇబ్బందులు



హయత్‌నగర్ డివిజన్‌లోని కాలనీలో మాన్‌సూన్ సిబ్బందితో మ్యాన్‌హోళ్లను తెరిపిస్తున్న కార్పొరేటర్

కొత్తపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. గాయత్రీనగర్-ఎస్ఆర్ఎల్ కాలనీ రహదారి వరద నీటలో మునిగింది. బృందావన్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లోలనూ వరద నీరు ముంచేత్తింది. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ఆయా ప్రాంతాలను సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. విజయవాడ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మార్గదర్శికాలనీలో భారీ వృక్షం నేలకూలడంతో అక్కడి నిలిపిన ఆటో దెబ్బతింది.

హయత్‌నగర్‌లో...

తెల్లవారు జామున కురిసిన వర్షానికి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీ రోడ్లపై వరద నీరు ప్రవాహించింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దాదాపు రెండు గంటల పాటు వర్షం కురిసింది. వనస్థలిపురం, హైకోర్టు కాలనీ, బీడీఎల్, భాగ్యలత, అరుణోదయ కాలనీల్లోని రోడ్లన్ని జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి కాలనీల్లో పర్యటించారు. మాన్‌సూన్ సిబ్బందితో మ్యాన్ హోల్స్ మూతలు తెరిపించారు.

● వనస్థలిపురంలో కురిసిన వర్షానికి హయత్‌నగర్ డివిజన్‌లోని హైకోర్టు కాలనీ, శారదానగర్, నర్సింహ్మారావు నగర్, కమలానగర్‌లో రోడ్లు జలమయం అయ్యాయి.

● చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో మంగళవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కాలనీలు జలమయమైనాయి. ఆయా డివిజన్‌లలో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు మోస్తారు వర్షం కురిసింది. కాలనీలలో వరద నీరు పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీరంతా చంపాపేటలోని రెడ్డికాలనీ మీదుగా దిగువ ప్రాంతాలకు వెళ్లింది.

● **చాదర్‌ఘాట్:** చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను వరద ప్రవాహం ముంచెత్తింది. మంగళవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి చైతన్యపురి మెట్రో స్టేషన్ పక్కనే ఉన్న చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లోకి సర్వీస్ రోడ్డుపై ప్రవహించిన వరద నీరు లోపలికి ప్రవేశించింది. పోలీస్‌స్టేషన్ ముందున్న పార్కింగ్ వరకు మాత్రమే వస్తుందని భావించిన సిబ్బంది చూస్తుండగా ఒక్కమారు వరద ప్రవాహం పోలీస్‌స్టేషన్‌లోకి రావడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇద్దరు కానిస్టేబుళ్లు బకెట్లతో వరద నీటిని ఎత్తి బయటికి పోరపోశారు. వరద నీరు చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లోకి చేరి బురద మయంగా మారింది.

కూలిన నాలా ప్రహరీ

చాదర్‌ఘాట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం తాకిడికి ఆజంపుర డివిజన్‌లోని ఫర్హత్‌నగర్ నాలా ప్రహరీ కూలింది. ప్రహరీతోపాటు దానికి బిగించిన ఇనుప కంచె కూడా కూలి వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది.

విషయం తెలుసుకున్న ఎంఐఎం నాయకులు షేక్ మోహియుద్దీన్ అబ్రార్ ఇచ్చిన సమాచారంతో మలకపేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల చేసిన ఫిర్యాదు మేరకు జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న నాలాను సందర్శించారు. తక్షణమే ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జడ్సీ వెంకన్న ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.





చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌ను ముంచెత్తిన వరద నీటిని ఎత్తిపోస్తున్న కానిస్టేబుళ్లు



వరదనీటి సమస్యలను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



కమలానగర్‌లో నేలకొరిగిన చెట్టును తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది



వర్షాలకు జలమయమైన చంపాపేటలోని రెడ్డికాలనీ



కూలిన ఫర్హత్‌నగర్ నాలా ప్రహరీని పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న





జిల్లెలగూడ మిథిలానగర్‌లో వీధులను ముంచేసిన వరద, ఆర్‌సీఐ రహదారిలో వరద ప్రవాహం

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి



నాదర్‌గుల్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

జోన్‌బృందం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతిని ఎల్బీనగర్, సరూర్‌నగర్, జిల్లెలగూడ మంద మల్లమ్మ చౌరస్తా, సరూర్‌నగర్, ఎన్టీఆర్‌నగర్, బైరామల్‌గూడ, సైదాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు రాజీవ్‌గాంధీ సేవలను కొనియాడారు.



ఎల్బీనగర్‌లో రాజీవ్‌గాంధీ జయంతితో పాల్గొన్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి తదితరులు



రాజీవ్ జయంతి వేడుకలో కేక్ కట్‌చేస్తున్న టఫ్‌ఐడీసీ చైర్మన్ చల్లా, మాజీ ఎమ్మెల్యే తీగల



ఎన్టీఆర్‌నగర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బైరామల్‌గూడలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీపాల్‌రెడ్డి తదితరులు



హనుమాన్ ఆలయంలో షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

ఆలయ ఆవరణలో షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

చంపాపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలో మంగళవారం నవగ్రహాల గుడి నుంచి దుర్గాదేవి ఆలయం వరకు చేపట్టనున్న షెడ్ నిర్మాణ పనులకు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు వర్షం, ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు దాతల సహకారంతో రూ.6 లక్షలతో షెడ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

స్వామి పల్లకీ సేవ కోసం గొడుగు

ఆలయ ధర్మకర్త బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా సహకారంతో మంచుకొండ రామ్మూర్తి, పద్మజ దంపతులు, కూతురు లాస్య రూ.20 వేలతో ధ్యానాంజనేయస్వామి వారి పల్లకీసేవ కోసం తయారు చేయించిన గొడుగును చైర్మన్ నల్లరఘుమారెడ్డి ఆలయానికి అప్పగించారు.

ఆర్టిజన్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

● దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం వద్ద టీజీయూఈఈయూ ధర్నా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో స్టాండింగ్ ఆర్డర్ ప్రకారం ఐదేళ్లు పూర్తయిన ఆర్టిజన్‌లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయూఈఈయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టిజన్లు ఖైరతాబాద్ దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అంతకుముందు మింట్‌కాంపౌండ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా మింట్‌కాంపౌండ్ చౌరస్తా నుంచి దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయానికి తరలివెళ్లారు. విద్యుత్ సంస్థలు ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కార్మికులను పై గ్రేడ్‌కు ప్రమోట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో ఆర్టిజన్లు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

'హైడ్రా' కమిషనర్‌కు శూరకర్ణారెడ్డి ఫిర్యాదు

సరూర్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో ప్రభుత్వ భూమి, చెరువుల ఎఫ్‌టీఎల్ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, వాటిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు రామిడి శూరకర్ణారెడ్డి హైడ్రా అధికారులను కోరారు. మంగళవారం ఆయన పలు నిర్మాణాల ఫొటోలతో హైడ్రా కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్మాస్‌గూడలోని సర్వే నంబర్లు. 32,33, 57,64,73,82,83,84,86/1,136,138లలో ప్రభుత్వ భూములు, చెరువుల ఎఫ్‌టీఎల్ స్థలాలు ఉన్నాయని, వాటిని కొందరు ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి సదరు నిర్మాణాలపై చర్యలు తీసుకుని, విలువైన ప్రభుత్వ స్థలాలను రక్షించాలని ఆయన కోరారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

తుర్కయాంజాల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

హయత్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలో డాక్టర్‌పై జరిగిన సామూహిక అత్యాచారాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తుర్కయాంజాల్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, సీపీఐ నాయకులు ప్రసాద్, పల్లపు శివ, సుందరమ్మ, భరత్‌నాయక్, రోజా, లక్ష్మి, సరోజా పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తు రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు రెండో రోజూ మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పార్కును సందర్శించిన మేయర్ పారిజాత

బడంగ్‌పేట్‌లో పార్కులను తీర్చిదిద్దుతాం

● మేయర్ పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పార్కులను స్థానికుల సౌకర్యార్థం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె కమిషనర్ జి.రఘు, 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డితో కలిసి ఆర్‌వీఆర్ కాలనీలోని పార్కును సందర్శించారు. అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హెచ్ఎండీఏ నిధులతో ఈ పార్కును అభివృద్ధి చేయిస్తున్నామని చెప్పారు. ప్రజలు ఉదయం సాయంత్రం ఆహ్లాదంగా గడిపేలా పార్కులను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మునిసిపల్ ఏఈఈలు వినీల్‌గౌడ్, సాయిరామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మలకపేట ఏసీపీ శ్యాంసుందర్

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్

చాదర్‌ఘాట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాలకు ఉత్సవ సమితి నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం మలకపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన గణేశ్ ఉత్సవ సమితి నిర్వాహకులు, మైత్రీ కమిటీ, శాంతి సంఘం సభ్యుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. సెప్టెంబర్ 7 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతి యుతంగా జరుపుకోవాలని కోరారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి విధించిన నిబంధనలను ఉత్సవ సమితి నిర్వాహకులు తప్పనిసరిగా పాటించి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మలకపేట ఎస్‌ఐలు సురేష్, నవీన్‌తోపాటు ఉత్సవ సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ రాయబారం పద్యనాటక ప్రదర్శనలో కళాకారులు

ఘనంగా ముగిసిన పద్యనాటక పోటీలు

వనస్థలిపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో వనస్థలిపురంలో ఈ నెల 18 నుంచి నిర్వహిస్తున్న నవమి పద్యనాటక పోటీలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ రంగస్థల కళాకారుల వారసత్వాన్ని కొనసాగించడానికి కళాభిమానులు సహకారం అందించాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.